బోటిగూడలో బోలెడు సమస్యలు

- కొత్త పంచాయతీగా ఆవిర్భావం
- అయినా సమస్యలు యథాతథం
- సమస్యల పరిష్కారంపై ప్రజల ఆశలు


బోటిగూడలో అసంపూర్తి దశలో ఉన్న డ్వాక్రా భవనం

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని రామంజాపూర్ పంచాయతీ నుంచి వేరుపడి కొత్త పంచాయతీగా ఏర్పాటైన బోటిగూడలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. సుమారు ఆరు వందల జనాభా ఉన్న ఈ గ్రామంలో సుమారు 470 మంది ఓటర్లు ఉన్నారు. రెండు బస్తీలుగా ఉన్న ఈ గ్రామంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. దీనికి తోడు వర్షాకాలంలో భూగర్భ మురుగు కాలువలు పొంగి దుర్వాసన వెదజల్లుతుంది. అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

బోరు నీళ్లే దిక్కు...


తాగునీటి నల్లా చుట్టూ మురుగునీరు

గ్రామంలో రెండు బస్తీలకు వేర్వేరుగా రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. వీటికి మిషన్ భగీరథ నీటి సరఫరా మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. దీంతో స్థానికంగా ఉన్న రెండు బోర్ల నీటిని ట్యాంకులోకి పంపించి, వాటి ద్వారా ఇంటింటి నల్లాకు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీళ్లను ముందుగా సంపులో నిల్వ చేసి, తర్వాత ఓవర్ హెడ్ ట్యాంకులోకి పంపింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ గ్రామంలో సంపు లేకపోవడంతో ఈ ప్రక్రియ కొనసాగడం లేదు. అడపాదడపా.. కిలోమీటరున్నర దూరంలో ఉన్న రామంజాపూర్ సంపు నుంచి ఇక్కడ ఉన్న ట్యాంకులోకి నీరు మళ్లిస్తే మిషన్ భగీరథ నీటి సరఫరా అవుతుంది. లేదంటే బోరు నీళ్లనే అన్ని అవసరాలకు వాడుకోవాలి.

ఏడేళ్లు కావస్తున్నా అసంపూర్తిగానే...

గ్రామంలో డ్వాక్రా భవనం నిర్మాణం ఏడేళ్లు కావస్తున్నా ఇంకా పూర్తి కావడంలేదు. ఒక దఫాలో బేసెమెంట్, మరో దఫాలో స్లాబ్ వేసి వదిలేశారు. గ్రామంలో 15 మహిళా సంఘాలు ఉన్నాయి. గ్రూపు సభ్యులు నెలలో మూడు సార్లు సమావేశం అవుతుంటారు. భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనంలోనే సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

రేషన్ కోసం రెండు కిలోమీటర్ల దూరం..

గ్రామంలో సుమారు 120 రేషన్ కార్డులు ఉన్నాయి. లబ్ధిదారులు రేషన్ సరుకుల కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రామంజాపూర్ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నెల నెలా సరుకులను ఇక్కడే పంపిణీ అయ్యేలా చూడాలన్నది స్థానికుల కోరిక. పంచాయతీ ఏర్పాటుతో ఈ సమస్య తీరుతుందని ఆశిస్తున్నారు.

రోడ్డు సమస్య తీరేనా...

బోటిగూడ శివారు నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధి ప్రారంభమవుతుంది. ఈ గ్రామం నుంచి కొత్తూరు మండలం పెద్దగుట్టతండా వెళ్లే మార్గం మట్టి రోడ్డుగానే ఉండిపోయింది. సుమారు కిలోమీటరు దూరం వరకు మట్టి రోడ్డు ఉండగా.. స్థానికులతో పాటు ఈ మార్గంలో రోజూ ప్రయాణం చేసే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జిల్లా పరిధి కారణంగా రోడ్డు పూర్తి చేయలేకపోయారు. పక్క గ్రామాలు సైతం రంగారెడ్డి జిల్లాలో విలీనం చేసి దశాబ్దం కావస్తున్నా.. ఈ రోడ్డు అభివృద్ధి కావడంలేదు.

మురుగుతో ఇబ్బందులు...

గ్రామంలో ఉన్న రెండు బస్తీల నుంచి ఏర్పాటు చేసిన భూగర్భ మురుగు కాలువలను గ్రామ మధ్యలో ఉన్న ఫిరంగి కాలువలో కలిపేశారు. పైప్‌లైన్ వేసేటప్పుడు సరైన జాగ్రతలు తీసుకోకపోవడంతో వర్షాలు కురిస్తే పైప్‌లైన్ పొంగి పొర్లి మురుగంతా బయటకు వస్తుంది. కొన్ని ఇళ్ల నుంచి మరుగుదొడ్డి పైప్‌లైన్‌ను భూగర్భ మురుగు కాల్వల్లో కలిపేయడంతో దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కనీస వసతులు కరువు

గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించేందుకు వైకుంఠధామం లాంటి శ్మశానవాటిక సౌకర్యం కూడా లేదు. చాలా మంది సొంత పొలాల్లోనే దహన సంస్కారాలు నిర్వహించుకుంటున్నారు. ఇక చెత్త డంపింగ్ యార్డును కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మరో వైపు పంచాయితీకి ఇప్పటి వరకు రెవెన్యూ భూముల కేటాయింపు, పంచాయతీ కార్మికుల సిబ్బంది నియామకం కూడా పూర్తి కాలేదు. దీంతో ప్రస్తుతం రామంజాపూర్ పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ, నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. మరో వైపు పంచాయతీ కార్యాలయాన్ని ఇటీవలే కమ్యూనిటీ భవనంలో ప్రారంభించారు. కొత్త భవనం నిర్మాణం చేయాల్సి ఉంది.


గ్రామం మధ్యలో ఉన్న ఫిరంగి కాలువలో చేరుతున్న మురుగునీరు

నీరు సరిగా రావడంలేదు



మా గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు సరిగా రావడంలేదు. బోరు నీళ్లనే సరఫరా చేస్తున్నారు. బోరు మోటారు మరమ్మతులు చేయాల్సి ఉన్నా.. కరెంటు సమస్య ఉన్నప్పుడు ఈ నీళ్లు కూడా రావడంలో ఆలస్యం అవుతుంది. భూగర్భ మురుగు కాలువలు పొంగి పొర్లి దుర్వాసన వస్తుంది.

– కె.కిష్టయ్య, బోటిగూడ

భవనం ఎప్పుడు పూర్తి చేస్తారో?



మహిళా గ్రూపుల కోసం నిర్మిస్తున్న భవనం పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడంలేదు. ఏడేళ్ల కిందట మొదలు పెట్టిన పనులు ఇంకా పూర్తి కావడంలేదు. నెల నెలా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నాం.

– కె.యాదమ్మ, మహిళా సంఘం సభ్యురాలు

తిరుమలహిల్స్ పార్కును పరిరక్షించండి

- హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు
- పార్కును పరిశీలించిన అధికారి

మణికొండ: అప్పటి హుడా ఆధ్వర్యంలో ఏర్పాటైన లే అవుట్‌లోని పార్కు స్థలం తమదని, మున్సిపాలిటీ నిర్మాణ అనుమతులు ఇచ్చిందని పనులు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని పార్కు స్థలాన్ని పరిరక్షించాలని కాలనీ వాసులు హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌ను కోరారు. గురువారం ఆయనను కార్యాలయంలో కలిసి పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయటంతో వెంటనే ఓ సీనియర్ అధికారిని పంపి స్థానికంగా పరిశీలించి నివేదిక తెప్పించుకున్నారు. వివరాలివీ... మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలహిల్స్ కాలనీలో సర్వే నెంబర్ 87, 119లలో 1994లో అప్పటి హుడా ఏర్పాటు చేసింది. అందులో పలు చోట్ల పార్కులకు స్థలాలు వదిలారు. వాటిలో ఒక చోట 6024 గజాల స్థలాన్ని పార్కుకు అప్పటి రియల్టర్‌లు వదిలి సదరు భూమిని అప్పటి పుప్పాలగూడ గ్రామపంచాయతీ పేరుతో గిఫ్ట్ డీడ్ చేశారు. కాలక్రమంలో రియల్టర్‌లు తిరిగి దాన్ని కొందరికి అమ్మకాలు చేయటం, వారు తెలియక కొనుగోలు చేశారు. అప్పటి నుంచి సదరు స్థలం వివాదం కోర్టులో కొనసాగుతున్నా కొందరు స్థానిక మున్సిపాలిటీ నుంచి అనుమతులు పొంది నిర్మాణాలు చేస్తున్నారని తిరుమలహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ అవినాశ్, మణికొండ మున్సిపాలిటీ, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీలు బుధవారం ఆయనకు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌ను విచారణ చేయాలని ఆదేశించటంతో ఆయన వచ్చి పార్కు స్థలాన్ని పరిశీలించారు. అందులో నిర్మాణాలు చేస్తున్న వారిని పనులు నిలిపివేయాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్మాణ అనుమతులు ఇచ్చిన వాటిని, క్రయవిక్రయాలను పరిశీలించి సదరు వ్యక్తులపై చర్యలకు సిఫారసు చేస్తామని అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. తిరుమలహిల్స్ కాలనీ ఉపాధ్యక్షుడు భరత్ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, కార్యదర్శి రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలను శుభ్రంగా ఉంచాలి


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: డ్రైనేజీలు నిండుకోకుండా ఎప్పటికప్పుడు శుభ్రత పనులను యంత్రాలతో చేపడుతున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లోని కపిలనగర్ కాలనీలో అండర్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. బండ్లగూడలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఆపరేటర్స్‌తో మేకనైస్డ్ అండర్ డ్రైనేజీ క్లినింగ్ చేపడుతున్నామన్నారు. ప్రజలు తమ డ్రైనేజీల్లో చెత్త, చెదారం, కవర్లు, వ్యర్థాలను వేయవద్దు అన్నారు. అవి ఇరుక్కుపోయి డ్రైనేజీ నీరు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. శానిటరీ జవాన్లు మల్లేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

కిస్మత్‌పూర్‌లో మాక్ డ్రిల్


మాక్ డ్రిల్‌లో పోలీసులు, అధికారులు, ప్రజలు

బండ్లగూడ: భారత్, పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత, యుద్ధ వాతావరణం నేపథ్యంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ చౌరస్తాలో జాతీయ స్థాయి పౌర రక్షణ మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. కమిషనర్ బి.శరత్‌చంద్ర, రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ డీఐలు సైరన్‌ను మోగించి యుద్ధ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ ఇ.మంజులత, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, మున్సిపల్ సిబ్బంది, పోలీసులు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

బీజేపీ రాజేంద్రనగర్ అధ్యక్షుడిగా సందీప్ ముదిరాజ్



రాజేంద్రనగర్: బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడిగా పసుపుల సందీప్ ముదిరాజ్‌ను నియమిస్తూ రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ... డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యం చేస్తూ పార్టీ అభివృకి కృషి చేస్తానన్నారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

రాజేంద్రనగర్ డీసీగా సురేందర్

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్‌గా సురేందర్ బుధవారం అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ రవికుమార్ వారం రోజులపాటు సెలవుపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో జీహెచ్‌ఎంసీ చాంద్రాయణ గుట్ట సర్కిల్ ఉప కమిషనర్ సురేందర్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు


సబితాఇంద్రారెడ్డిని అభినందిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: ఓబులాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డిని నిర్దోషిగా ప్రకటించడంతో బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బుధవారం ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ నేతృత్వంలో ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సబితాఇంద్రారెడ్డి దశాబ్ద కాలంలో మచ్చలేని నాయకురాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణలో ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారన్నారు. స్థానిక నేతలు ఎన్.రాముయాదవ్, కొంపల్లి జగదీష్, అశోక్ కుమార్, కార్తీక్‌ముదిరాజ్, వేణు, అనిల్, రామకృష్ణ, ప్రవీణ్, సన్నీ, కార్తీక్, సుమన్, సాయి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి'కి ప్రణాళికలు సిద్ధం చేయండి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్...

మణికొండ: కోకాపేటలో ఉన్న నాలాతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం, దోమల సమస్య పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని నివారించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదేశించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని లెజెండ్ చైమ్స్ గేటెడ్ కమ్యూనిటీలో బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గేటెడ్ కమ్యూనిటీల వాసులు కోకాపేట చెరువు నుంచి మూసీ నది వరకు ఉన్న నాలా ఓపెన్‌గా ఉండటంతో అందులోంచి దుర్గంధం వస్తుందని చుట్టు పక్కల నివాసితులు ఆయన దృష్టికి తెచ్చారు. దోమల వ్యాప్తి పెరిగిపోతుందన్నారు. దాంతో రోగాల బారిన పడ్డారని ఆయన దృష్టికి తెచ్చారు. దానిపై కప్పు వేయటం, మురుగు నీటిని శుద్ధి చేసేందుకు ఎస్టీపీని ఏర్పాటు చేయాలన్నారు. నార్సింగి నుంచి గండిపేటకు ఉన్న ప్రధాన రోడ్డు వర్షం పడితే వరద నీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవటంతో అదంతా రోడ్లపై నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందన్నారు. రోడ్డు పక్కన వరద కాలువలను నిర్మించాలని కోరారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే వాటి నివారణకు అవసమైన పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, మున్సిపాలిటీ, హెచ్‌ఎండీఏ నిధులను కేటాయించి పనులను చేపట్టాలన్నారు. ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌బాబు, నార్సింగి మున్సిపల్ కమీషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, గుడిమల్కాపూర్, నార్సింగి మార్కెట్ కమిటీల చైర్మన్‌లు టి.మల్లేష్‌ముదిరాజ్, కె.వేణుగౌడ్, ఆల్ గేటెడ్ కమ్యూనిటీస్ అసోసియేషన్ నాయకులు బి.సురేష్, చంద్రశేఖర్‌గౌడ్, నీలేష్ ప్రసాద్, రామచంద్రారెడ్డి, కిరణ్, వసంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆర్.నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం గంధంగూడలోని శ్రీ జ్ఞాన వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రజలందరూ సుఖసంతషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు రామచంద్రయ్య, సెక్రటరీ రాఘవులు, జి.రామారావు, మాజీ కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు రామేశ్వరరావు, డప్పు నవీన్, కృష్ణారెడ్డి, భోగాల శ్రీనివాస్, అంతారం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి జయంతి


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మణికొండ: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి అమ్మవారి జయంతి ఉత్సవాలను బుధవారం మణికొండ, పుప్పాలగూడ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరాలయం ఆవరణలో వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి పారాయణం, గణపతిపూజ, రుద్ర హోమం, లక్ష్మీకుబేర హోమం, వాసవి అమ్మవారి హోమం, అభిషేకం, సామూహిక కుంకుమార్చన పూజలను నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వి.యాదగిరి ఆధ్వర్యంలో అమ్మవారికి 108 రకాల ప్రసాదాలతో నైవేద్యాన్ని సమర్పించారు. ఆవోపా పుప్పాలగూడ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మణికొండ, భాగ్యలక్ష్మి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వాసవి మాత జయంతి ఉత్సవాలను నిర్వహించారు. తొమ్మిది రోజులుగా అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి పారాయణం నిర్వహించారు. బుధవారం జయంతి ఉత్సవాలతో వాటిని ముగించారు. ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శంకర్, జిల్లా అధ్యక్షుడు బి.శ్రీధర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు స్రవంతి, సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బాలుడిపై కత్తితో దాడి

రాజేంద్రనగర్: బాలుడిపై ఓ యువకుడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సమాచారం మేరకు... ఉప్పర్‌పల్లి ప్రాంతానికి చెందిన మైనర్ బాలుడు (16) మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద నిలబడి ఉన్నాడు. ఇదే సమయంలో అదే ప్రాంతానికి చెందిన నవీన్(22) కత్తితో మైనర్ బాలుడిపై దాడి చేశాడు. ఈ దాడిలో మూడు కత్తిపోట్లకు గురైన మనీష్ కింద పడటంతో స్థానికులు గమనించి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మనీష్ ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. నవీన్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి


హారిక (ఫైల్)

శంషాబాద్ రూరల్: అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పెద్ద షాపూర్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... పిల్లోనిగూడకు చెందిన హారిక అలియాస్ లక్ష్మీ(25) వివాహం పెద్ద షాపూర్ వాసి బి.ప్రసాద్‌తో రెండేళ్ల కిందట జరిగింది. వీరికి కవల పిల్లలు ఉన్నారు. అత్త గారింట్లో మంగళవారం హారిక బీపీ డౌన్ కావడంతో అనారోగ్యానికి గురైంది. దీంతో ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందింది. ఈ విషయాన్ని మృతురాలి తల్లిదండ్రులకు ఆలస్యంగా తెలిసింది. దీంతో వారు ఆమె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో డ్రైవర్ ఆత్మహత్య

రాజేంద్రనగర్: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేంద్రనగర్ ఎస్‌ఐ మామిడి కిశోర్ సమాచారం మేరకు... గాంధీనగర్‌కు చెందిన మహేందర్(35) డ్రైవర్. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి కోసం ఆందోళన


నీటి కోసం ఆందోళన చేస్తున్న వెళంకిని కాలనీవాసులు

శంషాబాద్: సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నా తమ కాలనీలో నీటి సరఫరా తీరు అస్తవ్యస్తంగా మారిందని మున్సిపాలిటీలోని వెళంకిని కాలనీవాసులు బుధవారం ఆందోళన చేపట్టారు. స్ట్రీట్ నంబర్–1 వద్ద ఉన్న నీటి ట్యాంకు వద్దకు చేరుకుని మెట్రో వాటర్ బోర్డు పనితీరుపై నిరసన వ్యక్తం చేశారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాల్సిన వాటర్‌బోర్డు వారానికి ఒక్కరోజు మాత్రమే నీటి సరఫరా చేపడుతున్నారని ఆగ్రహించారు. వచ్చిన రోజు కూడా కేవలం 20 నిమిషాలు కూడా రాకపోవడంతో నీటిని నింపుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోకపోతే వాటర్‌బోర్డు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు..

లింకు బంద్‌తో ఇబ్బందులు..

అహ్మద్‌నగర్ సౌత్ బస్తీలో ఒకేసారి 40 నల్లా కనెక్షన్లు క్రమబద్ధీకరించుకోకుండా నడిపిస్తున్నారని వాటర్‌బోర్డు ఇటీవల నీటి సరఫరా లింకును బంద్ చేసింది. ఇక్కడి బోరు కూడా పూర్తిగా పాడైపోవడంతో బస్తీ ప్రజలు నీటి కటకటతో కొట్టుమిట్టాడుతున్నారు. వీరికి బుధవారం మాజీ కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ సొంతంగా ట్యాంకర్లను తెప్పించి నీటి సరఫరా చేశారు.

'సిందూర్'పై హర్షాతిరేకాలు


హర్షం ప్రకటిస్తున్న నెక్నాంపూర్ మైనారిటీ ఫెడరేషన్ నాయకులు


హుడా కాలనీలో నినాదాలు చేస్తున్న వాకర్స్

మణికొండ: అమాయక పర్యాటకులను పొట్టనపెట్టుకున్న పాకిస్తాన్ ఉగ్రవాదులకు బుద్ధి చెప్పేలా బుధవారం తెల్లవారుజామున కేంద్ర ప్రభుత్వం, త్రివిధ దళాలు ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు చేయటంపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. ఉదయం నిద్ర లేచి చూసే సరికి ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాదుల శిబిరాలపై లాంచర్‌లతో దాడులు చేసి వారి పీచమణిచేలా చేయటంతో ప్రజలు ఎంతో సంబరపడ్డారు. మణికొండ మున్సిపాలిటీ హుడా కాలనీ పార్కులో వాకర్స్, నెక్నాంపూర్ గ్రామంలో మైనారిటీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మసిద్ ఇ హలీమా వద్ద ముస్లింలు జాతీయ జెండాలను పట్టుకుని భారత్‌కు అనుకూలంగా పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదుల అడ్డాలు లేకుండా చేయటంతో పాటు దాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని ఆకాంక్షించారు. కుల, మతాలకు వ్యతిరేకంగా మనమంతా భారతీయులమని, మన త్రివిధ దళాలకు బాసటగా నిలవాలన్నారు. ప్రపంచమంతా పాకిస్తాన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రస్తుత తరుణంతోనే మరో మారు మన దేశం వైపు చూడకుండా గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మణికొండ హుడా కాలనీ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు రమేష్‌బాబు, మైనారిటీస్ ఫెడరేషన్ నాయకులు షేక్ ఆరీఫ్, ఖుర్షీద్, సలాం, హమీద్, ఆదిల్, షేక్ అల్లాబక్ష్, అజీజ్, జియా, ప్రసాద్, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

ఉగ్ర శిబిరాలపై దాడి పట్ల హర్షం

రాజేంద్రనగర్: భారత సైన్యం ఆపరేషన్ సిందూర పేరిట ఉగ్రవాద శిబిరాలపై దాడి చేయడం పట్ల రాజేంద్రనగర్‌కు చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఉగ్రవాద కేంద్రాలతో పాటు ఉగ్రవాదులే లక్ష్యంగా భారత సైన్యం చేసిన క్షిపణి దాడి అభినందనీయమన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి వేముల మల్లేష్, ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, నాయకులు బండారు బాలకృష్ణ, బాబురావు తదితరులు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం తప్పదన్నారు. భారత సైన్యంపై ప్రజలందరికి నమ్మకముందని.. వారు ఎలాంటి చర్యలు చేపట్టినా ప్రజలంతా మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ఇలాంటి దాడులు మరిన్ని జరిపి ఉగ్రమూలను ఏరి పారేయాలని కోరారు.

20న సమ్మెను విజయవంతం చేద్దాం

బండ్లగూడ: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మికులంతా తరలిరావాలని గండిపేట మండల సీఐటీయూ కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మే 20వ తేదీన జరిగే సమ్మె నోటీసులను బుధవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల ఐదు శాతం ఉన్న పెట్టుబడిదారుల వద్ద 70 శాతం ఆదాయం పోగవగా 50 శాతం ప్రజల వద్ద కేవలం మూడు శాతం మాత్రమే ఆదాయం ఉందన్నారు. పేదరికం 17 శాతంకి పెరిగిందన్నారు. పెరిగిన ద్రవయోల్బణం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు కార్మిక, పేద, ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయన్నారు. ఈ నెల 20వ తేదీన కార్మికుల హక్కుల సాధన కోసం చేపట్టే సమ్మెను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. యాదగిరి, జవాన్లు సురేష్, సుభాష్, నరేందర్, జగన్, రామాజంనేయులు, నవీన్, రాము, తౌఫిక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.